www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:43 TUESDAY ,JUNE 23,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 43 మంగళవారం 23 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ..
# తెలంగాణ అభివృద్ధి పై కీలక చర్చలు

**జూన్ - 22- హంస కలంవార్త :**
కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం.

-మిగతా2లో




## ముఖ్యమంత్రి సభను విజయవంతం
## చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి...
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు..



**జూన్ - 22- హంస కలంవార్త :**
ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. -మిగతా2లో

## నీట్ రీ-టెస్ట్‌లో మున్నాభాయ్
## తరహా భారీ స్కామ్.. బట్టబయలు!




- బీహార్‌లో నీట్ రీ-టెస్ట్ సందర్భంగా ప్రాక్సీ రాకెట్ బట్టబయలు
- లఖిసరాయ్‌లో 24 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- అరెస్టయిన వారిలో మెడికల్ విద్యార్థులు, బయోమెట్రిక్ సిబ్బంది

# బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..
# ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
- సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి
- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికి పైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్




## మెట్రో అవినీతికి భయపడే రేవంత్
## డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

**జూన్ - 22- హంస కలంవార్త :**
తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పొలిటికల్ వార్ నెక్స్ట్ లెవెల్‌కు చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, తప్పులను కప్పిపుచ్చుకోవడానికే కేంద్ర ప్రభుత్వం పై బురదజల్లుతున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. -మిగతా2లో



## 30 నెలల్లో వినాశనం.. చీకటిని
## చూస్తేనే వెలుగుకు విలువ: కేటీఆర్

**జూన్ - 22- హంస కలంవార్త :**
బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే. కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు.

-మిగతా2లో



## రేవంత్ రెడ్డి విజన్‌ను చూసి బావ,
## బావమరిది జీర్ణించుకోలేకపోతున్నారు

- రేవంత్ రెడ్డి అన్ని రంగాలను గాడిలో పెడుతున్నారన్న చామల
- అధికారంలో ఉన్నన్నాళ్లు సినిమా వాళ్లతో కేటీఆర్ అంటకాగారని విమర్శ
- ఇప్పుడు కూడా సినిమా డైలాగులు చెబుతున్నారని మండిపాటు




## సాదాబైనామా దరఖాస్తుల
## పరిష్కారంలో వేగం పెంచాలి..

**జూన్ - 22- హంస కలంవార్త :**
రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో -మిగతా2లో



హంస కలం వార్త
HAMSA KALAM VARTA
మంగళవారం 23 జూన్ 2026

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ.. తెలంగాణ అభివృద్ధి పై కీలక చర్చలు

దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమార్వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. “నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను” అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు–అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## 30 నెలల్లో వినాశనం.. చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ: కేటీఆర్

బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే... కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. ‘అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు’ అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. కండలు తిరిగిన ఉస్తాదు అయినా మూడు నెలల్లోనే పిల్లలను పుట్టిస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని తెలుసని, కానీ 30 నెలల్లో పుట్టకపోతే ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో బూతుల మోతలు, పచ్చి అబద్ధాలు తప్ప ఏమీ లేవని మాజీ మంత్రి విమర్శించారు. ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం తప్పదని మొదటినుంచీ చెబుతున్నామని అన్నారు. వంద సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి వంద పైసలైనా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. డబ్బుల సంచులన్నీ ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఎగ్గొట్టి, యూరియా కోసం లైన్‌లలో నిలబడే పరిస్థితికి రైతులను తీసుకొచ్చారన్నారు. 30 నెలల్లో వినాశనం జరిగిందని.. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి...

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. అనంతరం జగనాధపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## రేవంత్ రెడ్డి విజన్‌ను చూసి బావ, బావమరిది జీర్ణించుకోలేకపోతున్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతుంటే... దాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈరోజు భువనగిరిలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ఎండగడుతూ విమర్శలు చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి విప్లవాత్మక మార్పులతో సీఎం రేవంత్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను గాడిలో పెడుతున్నారని చామల ప్రశంసించారు. ఈ డెవలప్‌మెంట్‌ను తట్టుకోలేకే బావ, బావమరిది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగిన కేటీఆర్... ఇప్పుడు రాజకీయాల్లో కూడా సినిమా డైలాగులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. “ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాగా కనిపిస్తున్నాయా? పదేళ్ల మీ పాలన ఏమైనా సూపర్ హిట్టా?“ అంటూ ఎంపీ ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల రూలింగ్‌లో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. మీ పాలన ఏమీ ‘షోలే’ సినిమా అంత హిట్ కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నేతలు... ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌ను ముంపు నుంచి కాపాడటంలో ‘హైడ్రా’ కీలక పాత్ర పోషిస్తోందని, నాలాల కబ్జాలను తొలగిస్తుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అలాగే మెట్రో ఫేజ్–2 ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ కూడా రాశారని గుర్తుచేశారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించి అభివృద్ధికి సహకరించాల్సింది పోయి.. చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

## నీట్ రీ-టెస్ట్‌లో మున్నాభాయ్‘ తరహా భారీ స్కామ్.. బట్టబయలు!

నీట్–యూజీ 2026 రీ–టెస్ట్ సందర్భంగా బీహార్‌లో ‘మున్నాభాయ్ ఎంబీబీఎస్‘ తరహాలో చోటుచేసుకున్న భారీ ప్రాక్సీ రాకెట్‌ను పోలీసులు రట్టు చేశారు. లఖిసరాయ్ జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా 24 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో 9 మంది ప్రాక్సీ అభ్యర్థులు, పలువురు మెడికల్ విద్యార్థులతో పాటు బయోమెట్రిక్ ఏజెన్సీకి చెందిన 14 మంది సిబ్బంది ఉండటం గమనార్హం. అసలు విద్యార్థులకు బదులుగా ఇతరులు పరీక్ష రాసే ప్రయత్నం బట్టబయలైంది. ఆదివారం దేశవ్యాప్తంగా నీట్ రీ–టెస్ట్ నిర్వహించిన విషయం తెలిసిందే. లఖిసరాయ్‌లోని కేంద్రీయ విద్యాలయ, కేఆర్‌కే హైస్కూల్, హసన్‌పూర్ హైస్కూల్ తదితర పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ ధృవీకరణ సమయంలో ఫొటోలు, వేలిముద్రలు సరిపోలకపోవడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పాట్నా మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న మయాంక్ కశ్యప్ అనే విద్యార్థి, బయోమెట్రిక్ ఏజెన్సీ ఉద్యోగిగా నటిస్తూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో నీట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ విచారణను ఎదుర్కొన్న అర్పిత్ రాజ్‌తో పాటు, బీహెచ్‌యూ, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, నలందా మెడికల్ కాలేజీలకు చెందిన విద్యార్థులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. అసలు అభ్యర్థుల తరఫున పరీక్ష రాసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఒప్పందాలు కుదిరినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. లఖిసరాయ్ జిల్లా కలెక్టర్ (డీఎం), ఎస్పీ సహా ఉన్నతాధికారులు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి విచారణను ముమ్మరం చేశారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, అక్కడక్కడా వెలుగుచూసిన కొన్ని ఘటనలు మినహా ఎలాంటి పేపర్ లీక్‌లు జరగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) స్పష్టం చేసింది.

## మెట్రో అవినీతికి భయపడే రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 టేకోవర్ వ్యవహారంలో తెరవెనుక భారీ ఎత్తున అవకతవకలు, అవినీతి జరిగాయని రఘునందన్ రావు సంచలన ఆరోపణ చేశారు. వీటిపై ఎక్కడ విచారణ జరిగి తనపై కేసులు ఫైల్ అవుతాయో అనే భయంతోనే... సీఎం రేవంత్ రెడ్డి కావాలనే కేంద్రంపై అభాండాలు వేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెట్రో ఫేజ్–2 పనులను కేంద్ర ప్రభుత్వం తొక్కిపెడుతోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఎంపీ పూర్తిగా కొట్టేశారు. “రాష్ట్రానికి ఐఆర్ఎఫ్‌సీ నుంచి వచ్చిన భారీ రుణం ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ గ్యారెంటీ (పూచీకత్తు) వల్లే సాధ్యమైంది. కేంద్రమే అంతగా సపోర్ట్ చేస్తున్నప్పుడు, మెట్రో ఫేజ్–2 పనులను మోదీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుంది“ అని తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలన తీరును రఘునందన్ రావు తనదైన శైలిలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గవర్నెన్స్ ‘సుతి లేని సంసారం’ లాగా తయారైందని ఫైర్ అయ్యారు. సొంత క్యాబినెట్ మంత్రులే ముఖ్యమంత్రి మాటలను అస్సలు ఖాతరు చేయడం లేదని, అందుకే రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్లిపోయి కేంద్రంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా: మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

# సంపాదకీయం

## రాజ్యాంగ నైతికతకు కవిత్వ రూపం!

"ప్రణవనాదాలెన్ని ప్రతిధ్వనించినా/ ఆదిమస్వరం నాదే/ ధరిత్రికి ఊపిరి నేను/ చరిత్రకు తొలి అక్షరం నేను/ నాగరికతకు నారుపోసి/ నీరు పోసింది నేను/ సంస్కృతికి బొడ్డుకోసి పేరుపెట్టింది నేనే/ సంగీత సాహిత్యాలు/ నాచెమట బొట్టు కన్నబిడ్డలు/... ఉన్మాదంపై/ నాది నిత్యదండయాత్ర/ నేనే నిజమైన దేశభక్తుడిని"

('నాగస్వరం')

సంపద సృష్టికర్తలైన దళిత బహుజనులే ఈ దేశ సాంస్కృతిక నిర్మాతలనే, నాగరికతకు మూలమనే ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కోయి కోటేశ్వరరావు 'నాగస్వరం' కవితా సంపుటిని తీసుకొచ్చాడు. ఇది దళితతాత్త్వికతను, దళిత ఈస్తటిక్స్‌ని వాగ్దానం చేసే అత్యంత శక్తివంతమైన కవిత్వం. సంప్రదాయ సాహిత్యలోని 'సత్యం, శివం, సుందరం' అనే భావనలకు భిన్నంగా సమానత్వం, స్వేచ్ఛ, సామాజికన్యాయం అనే రాజ్యాంగ నైతిక సూత్రాలను కళాత్మకంగా కవిత్వీకరించడం కోటేశ్వరరావు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. గత మూడు దశాబ్దాలుగా తాను ప్రత్యక్షంగా గమనిస్తున్న మనువాద సమాజ తీరుతెన్నులను; రాజకీయ, ఆర్థిక స్థితిగతులను; దళిత, బహుజన జీవితాల వేదనలను కోటేశ్వరరావు విమర్శనాత్మకంగా కవిత్వంలో పలికించాడు. దళిత కుటుంబంలో జన్మించిన కోయి, బాల్యంలో ఆకలీ అవమానాలను అనుభవించి, ఆ అనుభవంతో తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేక గొంతుతో కవిత్వం రాశాడు. సంప్రదాయ సాహిత్యంతో పాటు ఆధునిక సాహిత్యతత్త్వాన్ని అవగాహన చేసుకున్న సహృదయ కవిపండితుడు, విమర్శకుడు కోయి. దళిత జీవితంలోని పేదరికం, కులవివక్ష, రోజువారీ అణచివేతల వంటి దళిత వాస్తవికత, సంఘర్షణలను, వారి శ్రమతత్త్వాన్ని కవి సజీవంగా కవిత్వీకరించాడు: "వేదంలో ఏముందో తెలియదు గానీ/ మా అయ్య స్వేదంలోనే సృష్టి జీవం ఉంది" ('ప్రాణవాయువు'); "పత్తిచేలో ఇంకిపోయిన నెత్తురంతా/ మట్టిపెడాలమీద తెల్లగా నవ్వితేనే కదా నువ్వు బతికి బట్టకట్టింది'' ('లద్దెపురుగు') తల్లిదండ్రుల శ్రమను కేవలం కష్టానికి ప్రతీకగా మాత్రమే కాకుండా, సృష్టికి మూలంగా చిత్రించడంలో ఎంతో ఔచిత్యాన్ని ప్రదర్శించాడు: "మట్టిమబ్బుల్లో చెమటచుక్కల్ని నాటి/ ఎండి ఎన్నెల్ని బస్తాలకెత్తే" శ్రామికుడైన తండ్రిని "నల్ల చంద్రుడిగా" అభివర్ణించడం దళితకళాతత్త్వానికి నిదర్శనం. శ్రమను వెన్నెలతో పోల్చి దళిత శ్రమను విశ్వవ్యాప్త సృజనాత్మక శక్తిగా ఆవిష్కరించాడు. 'కొత్త చెప్పులు' కవితలో, "వొడ్లగింజల్లో ఇంకిపోయిన/ మా అయ్య వొంటిసత్తువ/ కూటికుండలో/ తుకతుక ఉడక్కపోతే/ ఊరికి కూడెట్టా దొరికేది?" అనే ప్రశ్నలు శతాబ్దాలుగా అణచివేయబడిన శ్రమదోపిడీని నిలదీస్తాయి. తాపీమేస్త్రిగా పనిచేస్తున్న తన తమ్ముడు శివ శ్రమ ఔన్నత్యాన్ని 'నమశ్శివాయ' కవితలో బొమ్మకట్టించాడు: "మిట్ట మధ్యాహ్నం వాడు మోస్తున్న/ ఇటుకల కాంతిలో ఎరుపెక్కిన చెమట చుక్కలు/ తనువు నుండి రాలి పడుతుంటే/ నేల తల్లిపై పగడాలవాన కురిసినట్లుండేది/ ఒంటి నిండా సిమెంటు ధూళితో/ తమ్ముడు సాయంత్రం ఇంటికి వస్తున్నప్పుడు/ భస్మాంగరాగయ నమశ్శివాయ అంటూ/ అంటూ పంచభూతాలు జేజేలు పలుకుతాయి". దళిత స్త్రీ జీవితం, కులవ్యవస్థతో పాటు పితృస్వామ్య వ్యవస్థలో కూడా బానిసత్వానికి గురవుతుంది. దీన్ని "బానిసకు బానిస" అనే బలమైన భావనతో ఆవిష్కరించాడు. 'పత్తి పువ్వు' కవితలోని "ఊరందరికీ మా అయ్య బానిసైతే/ పాపం అమ్మ, మా అయ్యక్కాడ బానిస" అనే పంక్తులు దళిత స్త్రీ ఎదుర్కొనే అంతర్గత అణచివేతను సూచిస్తాయి. "మాసిపోయిన వరదగుడి లాంటి/ అమ్మను చూసినప్పుడల్లా గొంతు చిట్లిపోయి/ పెన్ను నెత్తురు కక్కుతుంది/ అక్షరాలు మోయలేని/ ఒక ఏడుపు కొండ/ కనుల కొమ్మలకు వేలాడుతుంది/ ఆడతనం అంటరానితనాల నడుమ/ అమ్మ రోకలి బండ కింద చితికిన దోసబద్దయి రోదిస్తుంది'' ('పత్తిపూవు') వంటి పదచిత్రాలు దళితస్త్రీలు ఎదుర్కొనే బహుముఖీన వివక్షను నిత్యపోరాటంలోని సంఘర్షణని ప్రతిబింబిస్తాయి. కవిత్వంలో కేవలం బాధను వ్యక్తం చేసి ఊరుకోకూడదు. దాన్ని ఆయుధంగా మలచి తిరుగుబాటు చేసేలా ప్రేరేపించాలి. 'గుండెడప్పు' కవితలో రిజర్వేషన్లపై వచ్చిన విమర్శలకు ధీటుగా "ధాత్రి వేణువు ఊది/ ధాన్యరాగాలు పలికించే హరిత ప్రతిభ నాది", "అగ్ని ప్రతిభ నాది" అంటూ దళిత మేధస్సును, శారీరకశక్తిని గర్వంగా, నిలువెత్తు ఆత్మవిశ్వాసంతో ప్రకటించడం దళిత్ ఈస్తటిక్స్‌లో భాగమే. దీన్నే దళిత తిరుగుబాటు, అస్తిత్వ ప్రకటన (Dalit Aesthetics of Resistance and Assertion) అంటారు. 'ఉలిపికట్టె' కవితలో, మధ్యాహ్న భోజనంలో కుల వివక్షను ప్రశ్నిస్తూ "నాచేయి తగలగానే పరబ్రహ్మ స్వరూపం కూడా/ పనికి రానిదైపోయిందీ...?" అని అడగడం ద్వారా, కవి ఆ మత, సాంస్కృతిక ఆధిపత్యం యొక్క పవిత్రత (Purity) అనే భావనను ప్రశ్నించి, తద్వారా ప్రత్యామ్నాయ సంస్కృతిని అన్వేషించాలనే ఆలోచనను కలిగిస్తాడు. "మన సాంకేతిక పరిజ్ఞానం చంద్రుడి మీద రహస్యాలు శోధిస్తుంటే/ మన సంస్కారం మాత్రం ఇంకా కులం మలాన్ని వాసన చూస్తుంది" వంటి విమర్శలతో, ఆధునిక సాంకేతిక యుగంలో కూడా కుల అస్తిత్వాన్ని వదలని అమానుషాన్ని ప్రశ్నిస్తాడు. కులోన్మాదం, మతసామ్రాజ్యవాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ వ్యతిరేకతపై 'నాగస్వరం' ద్వారా కవిత యుద్ధం చేశాడు కవి. "వాడంతే పరమ యుద్ధోన్మాది/ ఒక్క చమురు బొట్టు కోసం/ లెక్కలేని రక్తసముద్రాలను పొంగిస్తాడు" అంటూ అమెరికా దురహంకారాన్ని ఎదిరించాడు. "నాగజాతి రక్తసంతకాన్నినేను/ ధమ్మపథ బాటసారిని నేను/ సత్యజ్యోతి కిరణాన్ని/ నేను భీమపతాకాన్ని" అంటూ కవి తన కవితాదృక్పథాన్ని స్పష్టంగా తెలియజేశాడు. బుద్ధుడు, పూలే, ముఖ్యంగా అంబేద్కర్ సైద్ధాంతిక ఎరుకతో తన కవిత్వానికి అపారమైన శక్తిని సమకూర్చుకొని పాఠకుల్ని ఆలోచింపజేస్తాడు కవి. దళితులు, బహుజనులంతా రాజ్యాధికారం కోసం కలిసి ప్రయాణం చేయాలన్న సందేశాన్ని కవిత్వం ద్వారా అందిస్తున్నాడు. 'కాలసర్పం', 'భీమరాజ్యం' వంటి కవితలు ఇందుకు ఉదాహరణలు. ఈ కవితా సంపుటికి రాసిన ముందుమాటలో శిఖామణి అన్నట్లుగా 'తీగల వంతెన' కవిత కోటేశ్వరరావు ఊహాశాలిత్వానికి పరాకాష్ఠగా కనిపిస్తుంది: "కాలం ఋతు రాగం శ్రుతి చేయగానే/ నింగికీ నేలకు నడుమ/ వెండి తీగల వంతెన రచిస్తుంది మేఘం/ ఆ వెండి తీగల్లో నిజ ప్రతిబింబాలను దర్శించిన వెలుగు కిరణాలు/ దిక్కుల మెడలో/ ఏడు రంగుల పూల హారాన్ని అలంకరిస్తాయి". రాజకీయ కవిత్వం తోపాటు ఇలాంటి అభివ్యక్తి సుందరమైన కవితలు కూడా 'నాగస్వరం'లో ఉన్నాయి. ప్రధానంగా ఈ కవితల్లో రాజ్యాంగ నైతికతను ప్రబోధించాడు కవి: "పుట్టిన దేశం ఋణం తీర్చుకోవడమంటే/ నిజాయితీగా నిన్ను అనుసరించడమే/ నీవు పంచిన విలువలను అనునిత్యం ఆచరించడమే ఇప్పుడు దేశభక్తి అంటే ('ఐ లవ్ యు') అంటూ దేశభక్తిని పునర్నిర్వచించాడు. మత గ్రంథాల కంటే, సనాతన, అధునాతన ధర్మాల కంటే రాజ్యాంగమే పవిత్రమైనదని ఈ కవి ఉన్నతంగా భావిస్తున్నాడు. నిజమే కదా? పండితుల సంస్కృత సాహిత్యానికి భిన్నంగా ప్రజలు నిత్య జీవితంలో ఎలా మాట్లాడుకుంటారో ఆ భాషనే ప్రయోగించడం దళిత్ ఈస్తటిక్స్‌లో భాషాపరమైన దృక్పథాన్ని తెలియజేస్తుంది. వ్యంగ్యం (satire), అధిక్షేపం (sarcasm), ఆర్ద్రత (compassion)తో కూడిన కోటేశ్వరరావు కవిత్వ శైలి పాఠకులను ఆకట్టుకుంటుంది. దళితులు అనుభవించే బాధను విశ్వజనీనం చేస్తూనే, వారి అస్తిత్వ చైతన్యాన్ని ఆత్మగౌరవ పోరాటాన్ని కవి 'నాగస్వరం'లో సముచితంగా చిత్రించాడు. దళిత అనుభవాలను శక్తిమంతమైన కవిత్వ భాషలోకి తీసుకువచ్చాడు. తెలుగు సాహిత్యంలో దళిత వాస్తవికత బలంగా ఎలా చూపించవచ్చో తెలుసుకోవాలనుకునే వాళ్ళకి ఈ మధ్యకాలంలో వచ్చిన దళిత రచనలన్నింటిలో 'నాగస్వరం' ప్రథమ స్థానంలో నిలుస్తుంది.

# మన సాహిత్యంలో మీటూ!

జూలియా మే జోనాస్ నవల 'వ్లాదిమిర్' ఆధారంగా అదే పేరుతో తీసిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ ఇటీవల విడుదలైంది. అందులో త్వరలో రిటైర్ అవ్వబోతున్న అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై అతను విద్యార్థినులతో హద్దు దాటి ప్రవర్తించాడని మీ--టూ నిందలు మొదలవుతాయి. అతనిపై న్యాయ విచారణ కూడా మొదలవుతుంది. అతను తన తరఫు న్యాయవాదిగా కూతురినే నియమించుకుంటాడు. తండ్రిపై అపారమైన నమ్మకంతో అతన్ని బయటపడేయటానికి ఆమె అన్నివిధాలా ప్రయత్నిస్తుంది. ఫిర్యాదు చేసిన ఒక పూర్వవిద్యార్థినిని కేసు వెనక్కి తీసుకోమని బలవంతపెడుతుంది, బెదిరిస్తుంది. న్యాయ విచారణ మొదలయ్యాక, ఒక్కొక్కరూ ప్రొఫెసర్ వ్యవహరించిన తీరును పంచుకుంటారు. ఏ ఆరోపణలోనూ బలం లేదు, కేసు వీగిపోతుందని దాదాపు ఖాయం అయిపోతుంది. తండ్రిని గెలుస్తున్నాడని కూతురు మురిసిపోతుంది. చివరిగా కూతురు కేసు వెనక్కి తీసుకోమని ఒత్తిడి పెట్టిన అమ్మాయి తన కథ చెప్తుంది: ఆమె చిన్న ఊరు నుంచి ఎన్నో కలలతో పై చదువుల కోసం ఈ యూనివర్సిటీలో చేరింది. ప్రొఫెసర్‌ను ఆరాధించింది. అతని లాంటి విజయాలు సాధించాలని ఆశయంగా పెట్టుకుంది. ఎవరూ తెలియని, ఎలా మసలుకోవాలో తెలియని ఆ విద్యాసంస్థలో అతన్నే దిక్సూచిగా పెట్టుకుంటుంది. కానీ అతను దాన్నే అలుసుగా తీసుకుని, ఆమెకు మానసికంగా, శారీరకంగా దగ్గరయ్యేలా వ్యవహరిస్తూ, చివరకు ఆమె చదువు మధ్యలో ఆపేయడానికి కారకుడవుతాడు. ఈ అమ్మాయి కథ విన్నాక కూతురికి తండ్రిపై అసహ్యం వేస్తుంది. కేసు వాళ్ళే గెలిచి ఉండచ్చు కానీ, ఇలాంటి ఆరోపణల వెనుక న్యాయ వ్యవస్థలు గుర్తించలేని నష్టాలెన్నో ఉంటాయని ఆమెకి అర్థమవుతుంది. తన తండ్రి అధికారాన్ని దుర్వినియోగం చేసిన తీరు కొందరి జీవితాలను కోలుకోలేని దెబ్బ కొట్టిందని గ్రహిస్తుంది. మీ--టూ మూవ్?మెంట్‌ను దాని చుట్టూ జరిగే గందరగోళపు వాదోపవాదాలను అర్థం చేసుకోడానికి ఈ కథ పనికొస్తుందని దీన్ని ఉటంకించాను. ఈ ఏడాది జ్ఞానపీఠ్ అవార్డును తమిళ రచయిత, గేయకర్త వైరముత్తుకు ఇవ్వడంతో పెద్ద దుమారమే లేచింది. ఆయన ఎందుకు అనర్హుడో చెప్పడానికి ప్రధానంగా రెండు కారణాలు వినిపించాయి: అతను రాసిన సాహిత్యం కన్నా తమిళంలో మరెంతో గొప్ప సాహిత్యం ఉందన్నది ఒక కారణం, ఆయనపై మీ--టూ ఆరోపణలు ఉన్నాయన్నది రెండో కారణం. చాలా విడ్డూరంగా, తమిళ సాహిత్యంలో హేమా హేమీలు అనదగ్గ వారి నుంచి కొత్తగా తమ గొంతులు వినిపిస్తున్నవారి దాకా (ఆడవారితో సహా) మొదటి కారణాన్నే ఎక్కువ ఎత్తిచూపారు. వైరముత్తుపై ఉన్న మీ--టూ ఆరోపణలు ఒకటీ రెండూ కావు, చిన్నాచితకవీ కావు. వాటి వల్ల కెరీర్లు పోగొట్టుకున్నవాళ్ళు ఉన్నారు. అతని కెరీరూ వెనుకంజ వేసింది. మీ--టూ నిందల ప్రస్తావన వచ్చినప్పుడు కూడా "నేర నిరూపణ జరగలేదు కదా? మరెందుకు అవార్డును ఇవ్వకూడదు/ వెనక్కితీసుకోవాలి?" లాంటి ప్రశ్నలు వినిపిస్తుంటాయి. పదిమంది అపరాధులు తప్పించుకున్నా పర్లేదు, ఒక నిరపరాధికి శిక్ష పడకూడదని మన న్యాయవ్యవస్థ నమ్ముతుంది. సాక్ష్యాధారాలు క్షుణ్ణంగా పరీక్షించిన మీదటనే, వాటికి తిరుగులేదని నిర్ధారించుకున్నాకే శిక్షలు వేస్తుంది. అయితే మీ--టూ కేసుల్లో ఎక్కువగా న్యాయస్థానం వరకూ వెళ్ళనివే, వెళ్ళినా నిరూపించలేనివే ఉంటాయి. ఎందుకంటే మీ--టూ అనేది కేవలం ఏదో ఒక్క దారుణ ఘటనో, దాని పర్యవసానమో కాదు. మీ--టూలో భాగంగా వచ్చిన కథనాలను తరచి చూస్తే వాటిల్లో కామన్‌గా కనిపించే లక్షణాలు కొన్ని ఉంటాయి: మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు చేసినవాళ్ళల్లో అధికార బలం కలిగినవాళ్ళే ఎక్కువ. కంపెనీల అధినేతలు, అభిమానుల బలం ఉన్న సెలబ్రిటీలు, ఇతరుల కెరీర్లను నిర్ణయించగలిగే స్థాయిలో ఉన్నవాళ్ళు... ఇలా. ఇక దాడులకు గురైన మహిళలు కింద స్థాయి ఉద్యోగినులు అయ్యుంటారు. దాన్ని అదనుగా తీసుకుని వారిపై దాడి చేసి, ఆ విషయం బయట పెడితే కెరీర్లు నాశనం అవుతాయని




బెదిరిస్తుంటారు. ఒకవేళ వారు బయటపెట్టినా కూడా, ఇలాంటి విషయాలపై మన సమాజంలో మళ్ళీ బాధితులపైనే రాళ్ళు పడుతుంటాయి. మన న్యాయవ్యవస్థలు ఈ మొత్తం తంతుని వీలైనంత జటిలంగా చేసి, దాడికి గురైన వారిని మానసికంగా, ఆర్థికంగా పీల్చిపిప్పి చేస్తుంటాయి. అంటే, ఇది ఒక పవర్ గేమ్! ఇక్కడే కేన్సిల్ కల్చర్ అక్కరకు వస్తుంది. ఎవరైతే అధికారం/ హోదా/ ప్రజాదరణ వంటి పీఠాలపై కూర్చున్నారో, వారిని ఆ స్థానాల నుంచి కిందకు దింపడానికి, లేదా కాస్తయినా కదిలించడానికి ప్రజాగ్రహమూ, ఆయా సంస్థలు తీసుకునే చర్యలూ వగైరా పనికొస్తాయి. ఒకడు దుర్వినియోగం చేసిన బలాన్ని వాణ్ణి నుంచి లాక్కునే ప్రయత్నం ఇది. వైరముత్తు విషయంలో, కేరళ కల్చరల్ అకాడమీ ప్రకటించిన "ఓఎన్వీ" అవార్డు వెనక్కి తీసుకోడానికి కారణం నిరసనలే! ఇలాంటి సందర్భాల్లో బాధితులు కేవలం "మాకు అన్యాయం జరిగింది!" అని ఆరోపించడం లేదు, అప్రమత్తం అవ్వండని హెచ్చరిస్తున్నారు కూడా! పితృస్వామ్య వ్యవస్థలో మగవారికి ఉండే అధికారాన్ని, హోదాని, ప్రివిలేజ్‌ను పూర్తిగా రూపుమాపడం ఇప్పటికిప్పుడు అయ్యే పని కాదు. కానీ వాటిని ఇలా అవార్డులు, గుర్తింపులు ఇచ్చి పెంచుకుంటూ పోతే, బాధితుల నుంచి ఆ హెచ్చరికలు కూడా మూగబోయే ప్రమాదం ఉంది. ఇక్కడ గమనించుకోవాల్సిన విషయం: వైరముత్తులాంటి సెలబ్రిటీ, జ్ఞానపీఠ్ లాంటి ప్రతిష్టాత్మకమైన వ్యవస్థకు సంబంధించినప్పుడు మాత్రమే ఈ సమస్యను చర్చకు పెట్టి, మన చుట్టూ నిత్యం జరుగుతున్న దారుణాలను---ముఖ్యంగా చిన్నవాటిని, ఝుంఝుశ్రీ ంవఇఅంఎని---బేఖాతరు చేస్తూ పోతే, సమస్య మరీ పెరుగుతూ పోతుంది. ముఖ్యంగా సాహిత్యలోకంలో కార్పొరేట్ల తరహా పాలిసీలు ఉండవు, వేరే పరిశ్రమల్లా యూనియన్లు ఉండవు. ఇంకెవరో ఈ విషయాలపై ట్రయినింగ్ ఇస్తారనో, అలా మసలుకోకపోతే జరిమానాలు వేస్తారనో అనుకోడానికి లేదు. కాబట్టి సాహిత్యకారులకే ఆ స్పృహ ఉండాలి. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో స్త్రీలకు సంబంధించినంత వరకూ అనారోగ్యకరమైన వాతావరణం నెలకొని ఉంది. ఇప్పటి తెలుగు రచయిత్రులు మాటల దాడులకు, హింసకు గురవుతున్నారు. అందరూ, అన్ని వేళలా అని అనడం లేదు. కానీ జరుగుతున్నంతమేరకు ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మరే ఇతర భాషలోనూ కనిపించని విషయం ఒకటి ఇక్కడ ఉంది: రచయిత్రి అందచందాలపైన, వస్త్రధారణపైన ఆమె రచనల ప్రతిభ, వాటికి వచ్చే స్పందన, తద్వారా పుస్తకాల అమ్మకాలు ఆధారపడి ఉంటాయన్న అతి హేయమైన వాదన సోషల్ మీడియాలో గత కొన్నేళ్ళుగా వినిపిస్తుంది. ఈ వాదనకు ప్రతివాదనల్లో కూడా రచయిత్రుల దుస్తులపై, రూపురేఖలపై, వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యానాలు చేయడం కనిపిస్తుంది. టెక్నాలజీని వాడుకుని ఫేక్ అకౌంట్లు, కాల్ రికార్డింగులు, స్క్రీన్?షాట్లు, ఫోటో మార్ఫింగుల సాయంతో ఇప్పుడు రచయిత్రులపై అభ్యంతరకరమైన పదజాలంతో దాడులు వికృత రూపాలు దాల్చుతున్నాయి. "దొరికితే దొంగ, దొరక్కపోతే దొర" చందాన ఆడవాళ్ళతో స్నేహం చేస్తూ, కలిసి పనిజేస్తూనే వాళ్ళపైనే ఆన్?లైన్?లో దాడులు చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఒక రచయిత స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తించాడు, లేదా ఫేక్ అకౌంట్ పెట్టి దాడులు చేశాడు, లేదా లైంగిక దాడికి ప్రయత్నిం చాడు/ చేశాడు అని తేటతెల్లమవుతున్నా కూడా దాని గురించిన చర్చ ఏవో మూడు ఫేస్‌బుక్ పోస్టులు, ఆరు కామెంట్లతో ముగిసిపోతున్నదే తప్ప, ఆ రచయితకు అప్పటి దాకా ఇచ్చిన అవార్డులు, గుర్తింపులు వెనక్కి తీసుకుంటున్నామన్న ప్రకటనలు కానీ, కనీసం ఆ వ్యక్తితో పనిచేసిన సంస్థల నుంచి "ఖండిస్తున్నాం" అన్న నామమాత్రపు అధికారిక ప్రకటనలు కానీ ఉండడం లేదు. బాధితులను జీవితాంతం వెంటాడే ఈ పీడ మరో నలుగురి నోట గాసిప్‌గా మిగిలిపోతున్నదంతే! చప్పుడంతా సద్దుమణిగాక రచయితకు మళ్ళీ అవకాశాలూ, అవార్డులూ షరా మామూలే! పరిస్థితి ఇలా ఉండటంతో, మరో దిక్కులేక, రచయిత్రులు ఢ్ష్ట్రఅంజూవతీ networks (ప్రమాదమైన వ్యక్తుల గురించి స్త్రీలు రహస్యంగా ఒకరిని ఒకరు వారించుకోవడం) పైనే ఆధారపడుతున్నారు. ఇలా నిబద్ధత లేని, ఆత్మపరిశీలన లేని మగవారు చేసే రచనల్లో ఎంత భావజాలాన్ని గుప్పించినా, ఎంతటి విప్లవ శంఖం పూరించినా ఆ సాహిత్యం ఎలా నిలబడుతుంది? అంతకంటే ముఖ్యమైన ప్రశ్న: ఇంతటి భయాందోళనపూరిత వాతావరణంలో మహిళలు ఎలా రాయగలుగుతారు? నైతికానైతికల బేరీజు వేసే తీరిక లేక ఇలాంటి ఆమోదయోగ్యం కాని నడకలను సమర్థిస్తూనే పోతే, ఈ రచయితల రచనలు మరో భాషలోకి అనువాదమైనప్పుడో, ఇంకో రాష్ట్రంలో వేదికను అలకరించమని ఆహ్వానం వచ్చినప్పుడో, అప్పుడు--అక్కడివారికి జరిగిన దారుణాలు తెలిస్తే, అది ఆ రచయితకు వచ్చిన అపవాదుగానే మిగలదు; అనువాదకులు, ప్రచురణకర్తలు, ఆర్గనైజర్లు... ఇలా అందరూ దానికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ వ్యాసం మొదట్లో ఉటంకించిన కథలో, తన తండ్రి వల్ల ఆడపిల్లలకు పూరించలేని నష్టాలెన్నో జరిగాయని గ్రహించాక ఆ కూతురు అతన్ని దూరం పెడుతుంది. ఆ మాత్రం సహృదయత, సహానుభూతి ఆమెకు ఉన్నాయి. మనుషుల అంతరంగాన్ని పట్టుకుని సాహిత్యాన్ని సృజిస్తామని చెప్పుకునే మనకు నిజానికి అంతటి సహానుభూతి ఉండకపోవచ్చు. కానీ, దీనికి ఒక ట్రెండింగ్ టాపిక్‌కు ఇచ్చే అటెన్షన్ మాత్రమే ఇస్తూ, ఈ దారుణాలన్నింటినీ చూసీచూడకుండా వదిలేసి మిన్నకుండి పోతే మనమందరమూ నేరంలో భాగం వహించినవారిగానే మిగిలిపోతాం.

# రాష్ట్రవ్యాప్తంగా జూన్ 23న పాఠశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

**-రాఘవేంద్ర, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడులి**

( జూన్ - 22- హంస కలంవార్త )

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జూన్ 23న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పాఠశాలల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లిరాఘవేంద్రలి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం లిరేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్రలి చేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లోపం, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సమస్యలను పరిష్కరించకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం దురదృష్టకరమన్నారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, పుస్తకాల విక్రయాలు, అక్రమ వసూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యను కాపాడాలని, పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్పొరేట్ విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అందువల్ల జూన్ 23న నిర్వహించే రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని, విద్యార్థులు, తల్లి దండ్రులు, ప్రజాసంఘాలు మరియు ప్రజలందరూ సహకరించాలని కోరారు.



# షాపులను కూల్చివేతలు చేపట్టి వాళ్ళ బ్రతుకులను రోడ్డుపాలు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు

( జూన్ - 22- హంస కలంవార్త )

సోమవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు కెపిహెచ్బి మూడో ఫేస్ పోచమ్మ దేవాలయానికి అనుకుని ఉన్న చిరు వ్యాపారస్తులను పరామర్శిస్తూ... పేద ప్రజల ఇండ్లు, చిరు వ్యాపారస్తుల షాపులను కూల్చివేస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు...కూకట్ పల్లి కెపిహెచ్బి కాలనీలో 2500 కోట్ల రూపాయల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మేసింది తప్పితే.. కూకట్ పల్లిలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు వైపు షాపులను పెట్టుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారస్తులకు జిహెచ్ఎంసి ద్వారా గుర్తింపు కార్డులను అప్లై చేసి తద్వారా వ్యాపారాలు సాగిస్తుంటే అధికారులు మాత్రం వాళ్ళ షాపులను కూల్చివేతలు చేపట్టి వాళ్ళ బ్రతుకులను రోడ్డుపాలు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు... ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారిని కూడా తొలగించి వారిని రోడ్డును పడేయడం ఎంతో బాధాకరమైన అంశమని.. వారికి ప్రత్యామ్నాయం కూడా అధికారులు చూపించడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. పోచమ్మ తల్లి ఆలయ సమీపంలో దాదాపు 40 సంవత్సరాలుగా షాపులు పెట్టుకొని బ్రతుకుతుంటే వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా షాపులను నేలమట్టం చేయడం తిరిగి వాళ్లపైన కేసులు పెడతామని భయభ్రాంతులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీకి కోవర్టులుగా వత్తాసు పలుకుతున్నారు తప్పితే ...అధికారులు వాళ్ళ పనిని వాళ్ళు చేసుకోవట్లేదని రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే.. కచ్చితంగా అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే హెచ్చరించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కినటువంటి రేవంత్ రెడ్డి సర్కార్ అరాచకాలను ప్రజలన్నీ గ్రహిస్తున్నారని ప్రజల ఓటు హక్కుతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ...రేవంత్ రెడ్డికి గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు... బడా బాబులకు వత్తాసు పలుకుతూ నిరుపేదలను రోడ్డును పడడమే కాంగ్రెస్ అభివృద్ధి అంటూ ప్రశ్నించారు.. వారు కూడా ఎన్నో ఆశలతో జీవిస్తారని... పిల్లల చదువులు.. కుటుంబ పోషణ వంటి కనీసం జీవించే హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు... ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకపోతే తగిన శాస్తి జరుగుతుందని అన్నారు... ఈ నేపథ్యంలోనే జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ను కలిసి నిరుపేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు.. ఈ కార్యక్రమంలో.. కోఆర్డినేటర్ సతీష్ అరోరా...మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి..రాజేష్, సాయి తదితర నాయకులు ,కార్యకర్తలు మరియు చిరు వ్యాపారులు పాల్గొన్నారు...





# నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం

( జూన్ - 22- హంస కలంవార్త )

నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అడ్మినిస్ట్రేషన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ వివిధ విభాగాల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు మరియు ప్రజలతో కలిసి డ్రగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించి, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**

**-జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్**

**-2026 ప్రారంభించిన జిల్లా ఎస్పి**

( జూన్ - 22- హంస కలంవార్త )

పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని ఎస్పీ అదనపు ఎస్పి తో కలిసి ప్రారంభించారు. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థ వంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయ స్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అదికారులు,సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, , డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్,కరుణాకర్,రవి,లక్ష్మీనారాయణ,కిరణ్ కుమార్,వేణు,ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**-తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**

( జూన్ - 22- హంస కలంవార్త )



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి కానుక -- ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం కేపీహెచ్‌బీ కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టారు అన్నారు ఉచిత బస్సు ఉచిత విద్యుత్తు గ్యాస్ సిలిండర్ పెట్రోల్ బంకులు ఆర్టీసీ బస్సులను మహిళలకే కేటాయించారన్నారు ప్రతి నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య ,కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ,పిడికిటి గోపాల్ చౌదరి, కిలారు శ్రీనివాస్, బాబు, రంగమోహన్ ,రజిత ,కల్పన, వాణి, సుజాత ,వనజ ,జ్యోతి, రజిని ,మైఖేల్ ,బాబ్జి, రమణ, వాసు, బొచ్చు మల్నీ ,తమ్మినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**-ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష**

**-జిల్లాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి**

**-రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్**

( జూన్ - 22- హంస కలంవార్త )



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు పై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె, గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల పై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు. అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎం.డీ.ఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యను జీవితం లో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సిక్త పట్నాయక్ ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరియు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి, ఇళ్లు ఎంతో నాణ్యంగా మరియు ఆకర్షణీయంగా నిర్మించబడినట్లు అభినందించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పై అవగాహన కల్పిస్తూ ఉత్సాహంగా సాగిన 2 కే రన్



( జూన్ - 22- హంస కలంవార్త )

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ,'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ ఐ ఆర్)పై అవగాహన కోసం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి నిర్వహించిన ప్రత్యేక "2 కే రన్"ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు."స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కోసం పరుగెత్తుదాం" అనే నినాదంతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమై కలెక్టరేట్ చౌక్,ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం వద్దకే చేరుకుంది. 2కే రన్ విజేతలకు ప్రశంస పత్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అధికారులతో కలిసి అందజేశారు. అనంతరం మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్'ప్రచారంలో భాగంగా మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనలు కలెక్టర్ మాట్లాడుతూ... ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ,'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు. గతంలో 2002 నాటి ఓటర్ల గణన ఆధారంగా ప్రస్తుతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ప్రజల ఇండ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లు అడిగే వివరాలను అందించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి ఇవ్వడం ద్వారా ఓటర్లు తమ ఓటును భద్రపరుచుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఈ విధమైన ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపడుతుందని,దీనివల్ల అనవసరంగా ఓట్లు తొలగిపోతాయనే అపోహలు ఎవరూ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. దీనితో పాటు సమాజంలో పెరిగిపోతున్న వ్యసనాలకు వ్యతిరేకంగా యువతకు అవగాహన కల్పించేందుకు'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యువత గంజాయి, కొకైన్ వంటి మత్తుపదార్థాల బారిన పడకుండా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కుటుంబాల్లో గాని, గ్రామాల్లో గాని ఎవరైనా వీటికి బానిసలైతే ఆ సమాచారాన్ని అందించి, వారిని డీ-ఎడిక్షన్ సెంటర్లకు పంపించి పునరావాసం కల్పించడం ద్వారా మళ్లీ వారు సంతోషకరమైన జీవితాన్ని గడిపేలా ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్రవంతి,ఆర్డీఓ జగదీశ్వర్ రావు,డిడబ్ల్యుఓ మిల్కా, డిఈఓ మాధవి, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, డిహెచ్ఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా,తహసిల్దార్ శ్రీనివాస్,యువత, పట్టణ ప్రముఖులు,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



( జూన్ - 22- హంస కలంవార్త )

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు .ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య,వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..."ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. శాఖలవారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి.వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

( జూన్ - 22- హంస కలంవార్త )

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని,ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టే నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని,ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని,జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షిత మైనదని,అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత,కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని,అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత,ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

( జూన్ - 22- హంస కలంవార్త )

జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరంలో ఎక్కడ కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులలో మురుగు జలాలు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సోమవారం ఉదయం నగరంలోని ఆయా ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. బోధన్ రోడ్, ఖిల్లా రోడ్డు, ఫ్రూట్ మార్కెట్, దేవీ థియేటర్ చౌరస్తా, ఖలీల్ వాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మార్గాలలోని డ్రైనేజీలను పరిశీలించి, చెత్త చెదారం పేరుకుపోకుండా వెంటవెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు జలాలు నిలువ ఉండకుండా సాఫీగా ముందుకు ప్రవహించేలా డ్రైనేజీలపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వానల వల్ల రోడ్లపై ఏర్పడే గుంతలను వర్షాకాలం అనతరం తక్షణమే పూడ్చివేయించాలని, అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో నగర ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా మంచినీటి సరఫరా తీరును నిశితంగా పర్యవేక్షణ జరపాలని అన్నారు. మరో మూడు నెలలకు అవసరాలకు సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని భరోసా కల్పించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా, విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు ఆరంభం నుండే నాణ్యమైన విద్యను బోధించాలని ఈ సందర్భంగా హితవు పలికారు. కాగా, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఈసారి నగరంలోని అన్ని డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఒక్కో సర్కిల్ వారీగా 60



డివిజన్లలో డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయడం, చెత్తను తరలించడం, పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలను శుభ్రం చేయడం వంటి పనులు పూర్తయ్యాయని అన్నారు. సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో మురుగు కాలువల్లో పూడికతీత పనులను కూడా వేగవంతంగా జరిపిస్తున్నామని, అవకాశం ఉన్న చోట జేసీబీల ద్వారా, మిగితా చోట్ల పారిశుధ్య కార్మికులతో డీసిల్టింగ్ పనులు జరిపిస్తున్నామని తెలిపారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కార్పొరేటర్ షకీల్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

# మొహరం పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

- పండుగ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి
- అవసరమైన చోట మినీ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- మొహరం సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలి
- మొహరం పండుగ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి



( జూన్ - 22- హంస కలంవార్త )

మొహరం పండుగను శాంతియుత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మొహరం పండుగ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మొహరం పండుగ సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొహరం పండుగ సందర్భంగా భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో మినీ హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మసీదులు, అశుర్ ఖానా పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. పండుగ రోజుల్లో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొహరం పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, ఏసీపీ పెద్దపల్లి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, , మున్సిపల్ కమిషనర్లు, వెంకటేష్, రమేష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దుందుభి వాగుపై రూ.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి మంత్రి శంకుస్థాపన

-మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పట్టుదలతోనే చిరకాల కల సాకారం

-మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

-నాగర్‌కర్నూల్ అభివృద్ధికి మరిన్ని నిధులు అందిస్తాం

-రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

( జూన్ - 22- హంస కలంవార్త )



నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలం సిర్సివాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్ రెడ్డి, తో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కలను సాకారం చేయడంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అసాధారణమైన పట్టుదలతో కృషి చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రశంసించారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి సాధన కోసం నిరంతరం శ్రమించే నాయకులు సమాజానికి ఎంతో అవసరమని, అలాంటి నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని మంత్రి సీతక్క తెలిపారు. సిర్సివాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ...., ఈ వంతెన నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, వేలాది మంది ప్రజల జీవితాలను సులభతరం చేసే చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నేడు నిజమవుతుండడం ఆనందంగా ఉందని బ్రిడ్జి నిర్మాణానికి నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, ప్రజలకు జన్మదిన కానుకగా ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ప్రత్యేక అభినందనలకు అర్హులని కొనియాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో నాగర్‌కర్నూల్, జడ్చర్ల నియోజకవర్గాల మధ్య అనుసంధానం మరింత బలపడుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దుందుభి వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవలు పొందాల్సిన ప్రజలందరికీ ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వాగులపై వంతెనలు లేకపోతే గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతటి కష్టాలు పడతారో తనకు బాగా తెలుసని మంత్రి చెప్పారు. తాను కూడా అడవి ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ప్రజల ఇబ్బందులను దగ్గరగా చూసిన అనుభవం తనకు ఉందన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**-మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. మహిళలు అందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న స్థాయి వ్యాపారాల నుంచి పెద్ద స్థాయి పరిశ్రమల వరకు మహిళలు ముందుకు రావాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మంత్రి తెలిపారు.

**-రాజేష్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఒకేరోజు సుమారు 8 వేల మహిళా భవనాలకు శంకుస్థాపన జరగడం దేశంలోనే ఒక చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. ప్రస్తుతం ఆ భవనాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలు జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలకు వచ్చినప్పుడు వసతి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా మహిళా భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒక్కో భవనానికి సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, శిక్షణ కేంద్రాలు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా ఈ భవనాలు ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలో కూడా రాణించాలని కోరారు. ముఖ్యంగా హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పర్యాటకం, ఆహార ఉత్పత్తులు, చేతివృత్తులు, సేవా రంగాల్లో వ్యాపార అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి తెలిపారు.

**-రహదారి పనులకు 84 కోట్లు**

తన శాఖ ద్వారా ఇప్పటికే సీఆర్ నిధుల కింద రూ.30 కోట్లు, ఎంఆర్ నిధుల కింద రూ.13 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు, వివిధ రహదారి అభివృద్ధి పనులకు రూ.84 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడతాయని హామీ ఇచ్చారు. ఇంకా నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

**-ప్రజల చిరకాలిక కోరిక నెరవేరింది**

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ డాక్టర్ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ...., ఈ ప్రాంత ప్రజల చిరకాలిక కోరిక నెరవేరిన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దుందుభి వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఈ ప్రాంత ప్రజలకు చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. 2008లో తాను జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో సిర్సివాడ గ్రామం జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో ఉండేదని ఎంపీ గుర్తు చేశారు. అప్పటి నుంచే ఈ ప్రాంత ప్రజల రాకపోకల సమస్యలను గుర్తించి వంతెన నిర్మాణం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చివరకు బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం లభించిందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లా వాసి కావడం వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని అన్నారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలు, ఆధునిక సౌకర్యాలతో కూడిన పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని ఎంపీ వెల్లడించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 50 ఏళ్ల చిరకాల స్వప్నం నేడు సాకారం కావడం ఎంతో ఆనందగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 50 సంవత్సరాల కల మంత్రి సీతక్క చేతుల మీదుగా నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రజల తరఫున మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క ఇప్పటికే సుమారు రూ.1000 కోట్ల మేర నిధులు మంజూరు చేశారని, తాజాగా మరో రూ.20 కోట్ల నిధులను కూడా కేటాయించడం వారికి నియోజకవర్గంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ..ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, జడ్చర్ల నియోజకవర్గాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా పాలన అందిస్తున్న ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమ్యూనిటీ భవనానికి భూమి పూజ రాష్ట్ర కార్మిక,ఉపాధి గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి



( జూన్ - 22- హంస కలంవార్త )

మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో రూ.25 లక్షల సీఎస్ఆర్ (సి ఎస్ ఆర్) నిధులతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు,స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సామాజిక,సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను నాణ్యతతో,నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ భవనం స్థానిక ప్రజలకు సమావేశాలు,సామాజిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రజా అవసరాల నిర్వహణకు ఉపయోగపడనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కాచిగూడలో ఎల్ఐసీ ఉద్యోగి అదృశ్యం?

-అతని మొబైల్ ఫోన్ కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్విచ్ ఆఫ్?

-ఆదివారం కాచిగూడ పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు

( జూన్ - 22- హంస కలంవార్త )



ఎల్ఐసీ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్ స్పెక్టర్ రాజశేఖర్ తెలి పిన వివరాల ప్రకారం నింబోలిఅడ్డ సంగం హోటల్ లేన్‌లో నివాసముం టున్న ముక్కెర మల్లేష్ కుమారుడు ముక్కెర మధు యాదవ్ (40) వృత్తి రీత్యా ఎల్ఐసీ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ ఉదయం 8.15 గంటలకు తన ద్విచక్ర వాహనం ప్యాషన్(q+‹sY:AP09Q0 477)పై విధులకు వెళ్తున్నట్లు ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో తన తమ్ముడు అనిల్ యాదవ్‌కు ఫోన్ చేసి మీటింగ్ ఉండటంతో ఇంటికి ఆలస్యంగా వస్తానని తెలిపాడు. అయితే రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడం తో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతని మొబైల్ ఫోన్ కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్వి చ్ ఆఫ్‌గా రావడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభిం చలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం కాచిగూడ పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు.

## ఉప్పల్ లో ఓటీపీ రాకుండానే రూ.5 లక్షలు మాయం!

-బ్యాంకు ఖాతా ఖాళీ ఇద్దరి

-బ్యాంకు ఖాతాల నుంచి రూ.5.31లక్షలు

-మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు

( జూన్ - 22- హంస కలంవార్త )



సైబర్ నేరగాళ్లు మరోసారి తమ మోసపూరిత చర్యలకు పాల్పడి ఓ మహిళ బ్యాంకు ఖాతాను ఖాళీ చేశారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ మహిళ ఖాతా నుంచి రూ.2.32 లక్షలను పలుమార్లు బదిలీ చేసి కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉప్పల్ హిల్స్ కాలనీకి చెందిన రాధిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖకునగదు ఉపసంహరణ కోసం వెళ్లగా తన ఖాతాలో కేవలం రూ.16 వేలే మిగిలి ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన ఆమె ఖాతా స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా తనకు తెలియకుండానే పలుమార్లు మొత్తం రూ.2.32 లక్షలు ఇతర ఖాతాలకు బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలకు సంబంధించి తన మొబైల్ ఫోన్‌కు ఒక్క ఓటీపీ సందేశం కూడా రాలేదని బాధితురాలు వెల్లడించారు. దీంతో వెంటనే ఆమె మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఖాతా వివరాలు ఎలా సైబర్ కేటుగాళ్ల చేతికి చేరాయనే కోణంలో విచారణ చేపట్టినట్లు సమాచారం

# స్పోర్ట్స్

## మహిళా క్రికెటర్లకు తీపికబురు



'అమ్మ'గా ఆటలో రాణించేందుకు అండగా ఐసీసీ. మహిళా క్రికెటర్లకు మరింత భరోసా కల్పించే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో ముందడుగు వేసింది. మాతృత్వ దశలో మహిళా క్రికెటర్లకు ఆర్థికంగా, వైద్య పరంగా సాయం అందించేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. బిడ్డను కన్న తర్వాత అమ్మగా.. మళ్లీ క్రికెట్ ఆడే వారికోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది అత్యున్నత క్రికెట్ మండలి. మహిళా ప్లేయర్లు పిల్లలకు జన్మనివ్వడం నుంచి.. మళ్లీ మైదానంలోకి దిగేంత వరకూ వారికి పెద్దన్నలా అన్ని విధాలా సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ వెల్లడించింది. ఐసీస ఈవెంట్లో పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకు వేతనాలు చెల్లిస్తున్న ఐసీసీ.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. తల్లైన తర్వాత మళ్లీ క్రికెట్ ఆడాలనుకునే మహిళా ప్లేయర్లకు అడుగడుగునా భరోసాగా నిలువనుంది. గర్భం దాల్చిన అనంతరం, ఆపై ప్రసవం అనంతరం శారీరక, మానసిక మార్పులకు లోనయ్యే మహిళా క్రికెటర్లకు అనుకూలమైన వాతావరణంలో శిక్షణ ఇవ్వాలని ఐసీసీ భావిస్తోంది. అలానే.. వారి పిల్లలను చూసుకోవడం, గర్భిణిలకు రవాణా, మెడిసిన్ ఖర్చులు భరించడం వంటివి చూసుకోనుంది. చాలామంది క్రికెటర్లు కెరీర్ సమయంలోనే వైవాహిక జీవితం వైపు మొగ్గు చూపిస్తున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయాలను అనుసరించాలనుకుంటోంది. ఆస్ట్రేలియా మహిళల జట్టు డాక్టర్ ఫిలిప్పా ఇంగే నేతృత్వంలోని ఐసీసీ వైద్య సలహా కమిటీ సూచనల మేరకు ఈ కార్యాచరణను రూపొందించారు. ఆరు దశలు..కాన్పు అనంతరం క్రికెట్ ఆడేందుకు సిద్ధపడే వారికోసం ఆరు దశల ప్రణాళిక ఉంది. రెడీ, రివ్యూ, రిస్టోర్, రీ-కండీషన్, రిటర్న్, రిఫైన్.. ఈ ఆరు విధానాలను అనుసరించి అమ్మలైన క్రికెటర్లను తిరిగి ఆటవైపు మళ్లించాలని ఐసీసీ భావిస్తోంది. మహిళా క్రికెటర్లకు మరింత భరోసా కల్పించే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో ముందడుగు వేసింది. మాతృత్వ దశలో మహిళా క్రికెటర్లకు ఆర్థికంగా, వైద్య పరంగా సాయం అందించేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. అందుకోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్‌ను నియమించనున్నారు. మూడో ట్రెమిస్టర్.. కాన్పు తర్వాత ఆరు లేదా ఎనిమిది వారాలకు క్రికెట్ సన్నాహకాలు ప్రారంభించడం వంటివి ఫిజియోథెరపిస్ట్ చూసుకుంటారు. 2021లో బిడ్డను కన్న వెస్టిండీస్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఇప్పుడు క్రికెట్ ఆడుతోంది. ఫ్లెచర్ మాదిరిగానే మరికొందరు మాతృత్వం అనంతరం ఏ ఇబ్బందులు లేకుండా మైదానంలో మెరిసేలా ఐసీసీ చొరవ చూపిస్తోంది.

## టెస్ట్ క్రికెట్‌లో రీ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన విరాట్ కోహ్లీ



భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో రీ ఎంట్రీపై కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్ట్ క్రికెట్లో రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడన్న ఊహాగానాలకు తెరదించాడు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీని టెస్ట్ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే ఆలోచన ఏమైనా ఉందా అని అడిగిన ప్రశ్నకు 37 ఏళ్ల కోహ్లీ స్పందిస్తూ తాను ఆ ఫార్మాట్‌కు పూర్తిగా స్వస్తి పలికానని, ఇక తిరిగి రానని స్పష్టం చేశాడు. అదంతా గతం అని కుండబద్ధలు కొట్టారు. ఐపీఎల్ సందర్భంగా కండరాల గాయానికి గురికావడంతో విశ్రాంతి తీసుకున్న కోహ్లీ.. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో రీ ఎంట్రీపై కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్ట్ క్రికెట్లో రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడన్న ఊహాగానాలకు తెరదించాడు. సోమవారం బెంగళూ రులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరుకానున్నాడు. ఈ గాయం కారణంగానే ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌కు అతను దూరమైన విషయం తెలిసిందే. కాగా, గతేడాది మేలో టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కింగ్ కోహ్లీ తన 14 ఏళ్ల టెస్టు క్రికెట్ కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్ 254 నాటౌట్. భారత టెస్టు చరిత్రలో అత్యధిక పరుగుల చేసిన ప్లేయర్ల జాబితాలో కోహ్లీ నాలుగో స్థానంలో నిలిచాడు.

## వైభవ్ విస్ఫోటం–11 బంతుల్లో అర్ధసెంచరీ



యువభారత్ జయకేతనం ముక్కోణపు వన్డే లంకపై ఘన విజయం ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ జయకేతనం ఎగురవేసింది. అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన కుర్రాళ్లు శ్రీలంక గడ్డపై సింహనాదం చేశారు. టోర్నీలో పేలవ ఫామ్‌తో విమర్శలకు గురైన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టైటిల్ పోరులో ఆకాశమే హద్దుగా చెలరేగిన వేళ భారత్ 'ఏ' ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హైదరాబాదీ తిలక్‌వర్మ సారథ్యంలోని భారత్ 'ఏ' 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ జయకేతనం ఎగురవేసింది. అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన కుర్రాళ్లు శ్రీలంక గడ్డపై సింహనాదం చేశారు. టోర్నీలో పేలవ ఫామ్‌తో విమర్శలకు గురైన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టైటిల్ పోరులో ఆకాశమే హద్దుగా చెలరేగిన వేళ భారత్ 'ఏ' ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. చిచ్చరపిడుగు సూర్యవంశీ(29 బంతుల్లో 94, 10ఫోర్లు, 8సిక్స్‌లు) వీరవిహారానికి తోడు కెప్టెన్ తిలక్‌వర్మ(90 బంతుల్లో 67, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో భారత్ 'ఏ' 50 ఓవర్లలో 377–9 భారీ స్కోరు చేసింది. లంక బౌలర్లను ఊచకోత కోస్తూ సూర్యవంశీ కేవలం 11 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు.

# బిజినెస్

## ఎలాన్ బై క్యాంపస్'ను పరిచయం చేస్తోంది క్యాంపస్ యాక్టివ్‌వేర్





భారతదేశంలో ప్రముఖ స్పోర్ట్స్ మరియు అథ్లీజర్ ఫుట్‌వేర్ బ్రాండ్ అనగానే మన అందరికి గుర్తుకు వచ్చేది క్యాంపస్. ఎన్నో ఏళ్లుగా నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా విశేష సేవలు అందిస్తున్న క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్.. స్టైల్, కంఫర్ట్ కోరుకునే ఆధునిక పురుషుడి కోసం 'ఎలాన్ బై క్యాంపస్'ను ప్రారంభించింది. ఈ ప్రారంభం ద్వారా, అభివృద్ధి చెందుతున్న నియో-క్యాజువల్ ఫుట్‌వేర్ విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ఇవాళ సగర్వంగా ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవానికి గుర్తుగా, ప్రఖ్యాత నటుడు జిమ్ సర్భ్ నేతృత్వంలో బ్రాండ్ యొక్క లేటెస్ట్ క్యాంపెయిన్ 'మోస్ట్ ఎలిగెంట్ మ్యాన్ ఇన్ టౌన్' మొదలుపెట్టింది. ఆయన విలక్షణమైన వ్యక్తిత్వం మరియు నిరాడంబరమైన ఆత్మవిశ్వాసం ఈ కలెక్షన్ స్ఫూర్తికి మరింత జీవం పోశాయి. ఈ ప్రారంభోత్సవం, మారుతున్న వినియోగదారుల అభిరుచులు మరియు జీవనశైలి అవసరాలను తీర్చడానికి, క్యాంపస్ యాక్టివ్‌వేర్ యొక్క పోర్ట్ ఫోలియోను స్పోర్ట్స్ మరియు అథ్లీజర్ కు మించి విస్తరింపజేస్తుంది. జీవితంలోని వివిధ సందర్భాలలో సునాయాసంగా మెరుపు వేగంతో కదిలి వెళ్లే పురుషుల కోసం రూపొందించబడింది ఈ 'ఎలాన్ బై క్యాంపస్'. దీనిద్వారా, ఉన్నతమైన స్టైల్‌ను రోజంతా సౌకర్యంతో మేళవించి, సాంప్రదాయ ఫార్మల్ ఫుట్‌వేర్‌కు ఒక సొగసైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. ఈ కలెక్షన్ లో ఉన్నతమైన డిజైన్ రావడం వల్ల ఇది రోజువారీ వాడకానికి అనువుగా ఉంటుంది. ఇది ఆఫీసు వేళలు, వ్యాపార సమావేశాల నుండి డిన్నర్ ప్లాన్‌లు, వారాంతపు విహారయాత్రలు మరియు మధ్యలో వచ్చే అన్ని సందర్భాలకూ అప్రయత్నమైన ఎంపికగా నిలుస్తుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా విజువల్ గా అద్భుతంగా ఉన్న క్యాంపెయిన్ ఫిల్మ్ ని లాంచ్ చేశారు. అన్నింటికి మించి ప్రశాంతమైన వృత్తి నిపుణుడు, చురుకైన ప్రయాణికుడు మరియు భావాలను వ్యక్తపరిచే ఫ్యాషన్ ప్రియుడు. కదలిక, భావోద్వేగం మరియు సినిమాటిక్ దృశ్య భాష ద్వారా, ఈ చిత్రం హుందాతనాన్ని ఒక సహజ లక్షణంగా, ప్రదర్శన కన్నా నిశ్శబ్ద ఆత్మవిశ్వాసం, బహుముఖ ప్రజ్ఞ మరియు ఉనికితో నిర్వచించబడిన ఒక వైఖరిగా ప్రదర్శిస్తుంది.

## సుందరం ఫైనాన్స్ ఖమ్మం బ్రాంచ్‌లో 25 ఏళ్ళు




సుందరం ఫైనాన్స్ తన ఖమ్మం బ్రాంచ్ 25 ఏళ్ల నిరంతర సేవను పూర్తి చేసిన సందర్భంగా ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తించింది. ఇది కేవలం కాలాన్ని జరుపుకోవడం మాత్రమే కాదు, కస్టమర్లతో ఉన్న దీర్ఘకాలిక భాగస్వామ్యం, ఉద్యోగుల అంకితభావం మరియు వారి కుటుంబాల మద్దతును గుర్తించడం కూడా. "సుందరం ఫైనాన్స్‌లో మమ్మల్ని నిలబెట్టేది కేవలం దీర్ఘకాలికత కాదు, నిజాయితీ, న్యాయం మరియు సేవ అనే ఆత్మ. ఈ బ్రాంచ్ నిలబడింది ఎందుకంటే ఇది తన విలువలను పాటించిందిమరియు ఇది సేవ చేసే సమాజానికి చెందినది." అని సుందరం ఫైనాన్స్ ఆంధ్రా ప్రాంత ఉపాధ్యక్షుడు మరియు హెడ్ శ్రీ ఎస్. బాలసుబ్రహ్మణియన్ అన్నారు. "2000లో స్థాపించబడిన ఖమ్మం బ్రాంచ్, ఖమ్మంలో ఆర్థిక ప్రాప్యతను విస్తరించడంలో కీలక పాత్ర పోషించింది, తరచుగా ప్రధాన ఆర్థిక వ్యవస్థకు అందని కస్టమర్లకు సేవలు అందించింది. చిన్న వ్యాపార యజమానులు, మొదటిసారి రుణగ్రహీతలు, స్వయం ఉపాధి నిపుణులు మరియు రవాణా నిర్వాహకులు ఈ బ్రాంచ్‌లో విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిని కనుగొన్నారు" అని ఖమ్మం రిటైల్ బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ కాసి మురళి కృష్ణ అన్నారు. ఈ బ్రాంచ్ కేవలం ఆర్థిక సహాయం కోసం మాత్రమే నిలబడలేదుఇది పారదర్శకత, గౌరవం మరియు మానవీయ స్పర్శ కోసం నిలబడింది, తరతరాల కస్టమర్లకు జీవనోపాధి నిర్మించడంలో మరియు ధైర్యంగా జీవించడంలో సహాయపడింది. ఖమ్మం బ్రాంచ్ బలం దాని ప్రజలలో ఉంది. అనేక మంది ఉద్యోగులు తమ కెరీర్‌లో ముఖ్యమైన భాగాన్ని ఇక్కడ గడిపారు, కేవలం నైపుణ్యంతో కాకుండా నిజాయితీ, అనుకంప మరియు లక్ష్యంతో సేవ చేశారు. వారి బంధం కస్టమర్లతో లావాదేవీలకు మించి ఉందిఇది పరస్పర గౌరవం మరియు పంచుకున్న పురోగతిపై నిర్మించబడింది. ఈ మైలురాయి ఉద్యోగుల కుటుంబాలను కూడా గౌరవిస్తుంది, వారు ప్రతి విజయానికి నిశ్శబ్దంగా వెనుక నిలబడ్డారు.

## పోర్షే ఉద్యోగుల్లో గుబులు..!




త్వరలో కొత్త పొదుపు ప్రణాళిక ప్రముఖ జర్మన్ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ పోర్షే తన ఖర్చులను తగ్గించుకునే క్రమంలో రెండో విడత వ్యయ నియంత్రణ ప్యాకేజీని జులై నాటికి ఖరారు చేయాలని నిర్ణయించింది. ఫ్యాక్టరీ సెలవులకు ముందే ఉద్యోగ సంఘాలతో ఒప్పందం కుదుర్చుకుని.. సిబ్బందికి భవిష్యత్తుపై స్పష్టతనివ్వాలని సిఇఒ మైఖేల్ లైటర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలుస్తోంది. గతేడాది 2,000 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించిన కంపెనీ.. రాబోయే కొన్నేళ్లలో మరో 1,900 ఉద్యోగాలను తగ్గించాలని ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో తాజా పొదుపు చర్యల ప్రకటనతో తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయోనని వారిలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి..అంతర్జాతీయ సుంకాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో లాభాలు తగ్గడంతో పోర్షే ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. గత ఏడాది 2.8 లక్షల కార్లను విక్రయించిన సంస్థ ఇకపై తక్కువ ఉత్పత్తి సామర్థ్యంతోనే అధిక లాభాలను సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో సోదర సంస్థ ఆడితో కలిసి పనిచేయడంతో పాటు, వ్యయాలను తగ్గించుకునే దిశగా వ్యూహాలను అమలు చేస్తోంది.

# బాలయ్య-కొరటాల మూవీకి ముహూర్తం ఫిక్స్





లాంచ్ కార్యక్రమానికి అతిథులు వీరే..! నందమూరి నటసింహం బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా అధికారిక ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 25న విజయవాడ సమీపంలోని వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ గ్రాండ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన సినిమా మొదటి షాట్‌కు క్లాప్ కొట్టనున్నారు. అలాగే మంత్రి కందుల దుర్గేష్ కూడా ఈ వేడుకలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మాస్ హీరో బాలకృష్ణ, సందేశాత్మక కథలకు కేరాఫ్‌గా నిలిచిన కొరటాల శివ తొలిసారి కలిసి పనిచేయడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్', 'దేవర' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కొరటాల, బాలయ్య కోసం పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బాలకృష్ణ డైలాగ్ డెలివరీ, మాస్ యాక్షన్‌తో పాటు కొరటాల శివ మార్క్ సామాజిక అంశాలు ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. నందమూరి నటసింహం బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చిత్రం 'చీదీఖ112' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా అధికారిక ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 25న విజయవాడ సమీపంలోని వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ గ్రాండ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. విజయవాడలో ఈ ప్రారంభోత్సవాన్ని నిర్వహించడం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నారా లోకేష్ ముఖ్య అతిథిగా రావడం వల్ల ఈ కార్యక్రమానికి రాజకీయంగానూ ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. బాలయ్య అల్లుడైన లోకేష్ క్లాప్ కొట్టడం నందమూరి అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఒక బలమైన కమ్యూనిటీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథతో రూపొందనుందట. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక వ్యక్తి చేసే పోరాటాన్ని బాలయ్య స్టైల్ మాస్ ఎలిమెంట్స్‌తో కొరటాల శివ చూపించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన హీరోయిన్, సంగీత దర్శకుడు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను జూన్ 25న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యంత భారీ ఓపెనింగ్ అందుకునే చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# చిరంజీవితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి భేటీ



తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. పొలిటికల్ రీ ఎంట్రీపై మళ్లీ ఊహాగానాలు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి-బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# 'నా బిడ్డే నా ప్రపంచం'-సమంత ఎమోషనల్



స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ హ్యాపీ మూడ్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుని విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మరోవైపు, సమంత తల్లి కాబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో మాతృత్వంపై సమంత చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. కొన్నేళ్ల క్రితం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత మాతృత్వం గురించి ఎంతో భావోద్వేగంగా మాట్లాడింది. తల్లిగా మారడం తన జీవితంలో అత్యంత అందమైన, ప్రత్యేకమైన అనుభవంగా భావిస్తానని ఆమె తెలిపింది. నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. పిల్లల పెంపకం, కుటుంబ బాధ్యతలు, ఉద్యోగాన్ని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగే మహిళలంటే నాకు ఎంతో గౌరవం అని సమంత పేర్కొంది. తన చిన్ననాటి జీవితం అంత సులభంగా సాగలేదని సమంత తెలిపింది. తాను ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పెరిగానని, అందుకే భవిష్యత్తులో తన పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా ప్రేమ, ఆప్యాయతలు, సౌకర్యవంతమైన జీవితం అందించాలని కోరుకుంటానని చెప్పింది.చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి అనుభవాలు ఎదుర్కొన్న వారు తమ పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటారు. అమ్మతనం గురించి కామెంట్స్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ హ్యాపీ మూడ్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుని విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మరోవైపు, సమంత తల్లి కాబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. నేను కూడా అదే కోరుకుంటాను అని సమంత వెల్లడించింది. తల్లి అయిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు పూర్తిగా పిల్లల పెంపకానికే సమయం కేటాయించాలని తాను భావిస్తున్నట్లు సమంత తెలిపింది. నాకు బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాలు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. నా బిడ్డే నా సర్వస్వంగా మారిపోతాడు లేదా మారిపోతుంది. కెరీర్ కంటే కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాను అని ఆమె అప్పట్లో చెప్పింది.ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ వేడుకల్లో సమంత కనిపించిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఆధారంగా ఆమె తల్లి కాబోతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు సమంత నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కూడా ఆమె స్పందించలేదు.సమంత గతంలో మాతృత్వంపై చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి వైరల్ అవుతుండటంతో అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు



అల్లు అర్జున్ దుమ్మాతో వచ్చే నెలకి వాయిదా టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 'పుష్ప-2: ది రూల్' స్పెషల్ ప్రీమియర్ సందర్భంగా చోటుచేసుకున్న విషాద ఘటనకు సంబంధించిన కేసును విచారిస్తున్న హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టు అల్లు అర్జున్‌కు సమన్లు జారీ చేయగా, జూన్ 22న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే పలు షూటింగ్స్‌తో బిజీగా ఉన్న క్రమంలో నేడు బన్నీ దుమ్మా కొట్టాడు. వ్యక్తిగత మినహాయింపు ఇవ్వాలని బన్నీ కోర్టుని కోరినట్టు తెలుస్తుంది. మరోవైపు కేసుకి సంబంధించిన మిగతా వారంతా హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. ఈ క్రమంలో కేసుని విచారించిన న్యాయమూర్తి జూలై 6కి వాయిదా వేశారు. 2024 డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో 'పుష్ప-2' స్పెషల్ ప్రీమియర్ షో నిర్వహించారు. హీరో అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో అక్కడ తీవ్ర రద్దీ నెలకొంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. సినీ, రాజకీయ వర్గాల్లోనూ దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన చిక్కడపల్లి పోలీసులు ఇటీవల నాంపల్లి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొన్న పోలీసులు, థియేటర్ యాజమాన్యం మరియు సిబ్బందిని ఏ1 నుంచి ఏ10 నిందితులుగా చేర్చారు. టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 'పుష్ప-2: ది రూల్' స్పెషల్ ప్రీమియర్ సందర్భంగా చోటుచేసుకున్న విషాద ఘటనకు సంబంధించిన కేసును విచారిస్తున్న హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టు అల్లు అర్జున్‌కు సమన్లు జారీ చేయగా, జూన్ 22న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చింది. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా పేర్కొనడం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ముందస్తు అనుమతులు, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, పోలీసుల సూచనలను సక్రమంగా అమలు చేయకపోవడం, సమన్వయ లోపాలు చోటుచేసుకోవడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు తమ చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.అయితే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యే అవకాశం కల్పించాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని నాంపల్లి కోర్టు తిరస్కరించింది. విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ కేసులో గతంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, అనంతరం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి వైద్య సహాయం, ఆర్థిక సాయం అందించారు..

# 'పెద్ది' బ్లాక్‌బస్టర్ సంబరాలకు రంగం సిద్ధం




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో ఆత్మగౌరవం, క్రీడా స్ఫూర్తి, భావోద్వేగాలను సమర్థవంతంగా ఆవిష్కరించిన దర్శకుడు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రత్నవేలు అద్భుతమైన విజువల్స్‌ను అందించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. రామ్ చరణ్ గత చిత్రం ఆశించిన ఫలితాన్ని అందుకోకపోవడంతో 'పెద్ది'పై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది.

# 'ఓజీ 2'కి సంకేతాలు-పవన్ ఫ్యాన్స్‌లో కొత్త జోష్



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' ఫ్రాంచైజీకి సంబంధించి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ గతంలో ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, 'ఓజీ యూనివర్స్'తో పాటు 'ఓజీ 2'కు సంబంధించిన చర్చలు ఇప్పటికే ప్రారంభమైనట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సోషల్ మీడియాలో 'ఓజీ 2' పేరు మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. తాజాగా దర్శకుడు సుజీత్‌తో జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. క్రియేటివ్ వర్క్స్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 'ఓజీ' భవిష్యత్ ప్రణాళికలు, యూనివర్స్ విస్తరణ, సీక్వెల్ రూపకల్పన వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ అప్‌డేట్ బయటకు రావడంతో పవన్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. 'ఓజీ 2' ఎప్పుడు ప్రారంభమవుతుందా? అనే చర్చలు ఇప్పటికే సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. 'ఓజీ' మొదటి భాగం విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ అవతారం, సుజీత్ రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ ప్రెజెంటేషన్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ముఖ్యంగా పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రెజెన్స్, హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449